వన్యప్రాణులకు దప్పిక కష్టాలు

ఎండలు దంచి కొడుతున్నాయి.. మండుటెండల్లో వన్యప్రాణులు దాహంతో అలమటించి పోతున్నాయి. స్థానిక అడవుల్లో 32 రకాల జీవరాశులు ఉండగా వాటి దాహం తీర్చడంలో అటవీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సమీపంలోని క్వారీలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ ఆ నీటిని సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు.

- కొప్పగూడ క్వారీలో నీటి నిల్వ
- నీరు తాగేందుకు అనువుగా లేని వైనం
- మెట్ల నిర్మాణానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు
- నేటికీ అభివృద్ధి శూన్యం


కొప్పగూడ వద్ద క్వారీలో నీరు


క్వారీ చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

కెరమెరి: నీటి వసతి ఉన్నా అటవీ అధికారులు నీటిని సద్వినియోగం చేసుకోవడంలో అలసత్వం ప్రదర్శిస్తుండడంతో వన్యప్రాణులు, పక్షులు, జీవరాశులు ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో ఒక్కోసారి నీటి కోసం రోడ్లపైకి వచ్చి కుక్కల దాడుల్లో వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయి. 2017లో అప్పటి ఫారెస్ట్ డివిజనల్ అధికారి రవీందర్ గౌడ్ కెరమెరి అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. కొప్పగూడ వద్ద ఉన్న క్వారీని పరిశీలించి జనసంచారం లేని ప్రాంతంగా గుర్తించారు. వన్యప్రాణులు ఇక్కడికి వచ్చి నీరు తాగేందుకు అనువుగా ఉంటుందని, నీటిలో దిగేందుకు మెట్ల నిర్మాణంతో పాటు క్వారీ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. కాని నేటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పటికీ క్వారీలో పుష్కలంగా నీరున్నా నిరుపయోగంగా మారింది. కాగా సిమెంట్ స్తంభాలతో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్లు తెగిపోవడంతో పాటు స్తంభాలు నేలకొరిగాయి.

50 వేల ఎకరాల్లో..

మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 21 బీట్లు, 8 సెక్షన్లు ఉన్నాయి. 21 బీట్ అధికారులు ఏడుగురు, 8 మంది సెక్షన్ అధికారులకు ఐదుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 50వేల ఎకరాల్లో అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో సుమారు 32 రకాల వన్యప్రాణులు, పక్షులు, ఇతర జీవరాశులు మనుగడ సాగిస్తున్నాయి. వీటిలో చిరుత, నీలుగాయి, కొండ చిలువ, పందులు, గొర్రెలు, అంబోతు, ఎలుగుబంట్లు, జింకలు, నక్కలు, తోడేళ్లు, కొండగొర్రెలు, బల్లులు, వివిధ రకాల పాములు, కోళ్లు, నెమళ్లు, అడవి పందులు, ముల్ల పందులు, తదితరాలు ఉన్నాయి. కానీ జీవరాశులకు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాయి. ఎండలు మండతున్న నేపథ్యంలో వేసవి తాపానికి వన్యప్రాణుల దాహార్తి తీరడం కష్టంగా మారనుంది.

పుష్కలంగా నీరు..



కొప్పగూడ క్వారీలో నీరు పుష్కలంగా లభ్యమవుతోంది. అడవిలో జీవించే వన్యప్రాణులు, ఇతర జీవరాశులు క్వారీలో నీటిని తాగేందుకు మెట్లు నిర్మించాల్సి ఉంది. గతంలోనే ప్రతిపాదనలు పంపినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఉన్నతాధికారులు స్పందిస్తే వన్యప్రాణుల దాహం తీర్చొచ్చు.

– సయ్యద్ మజారొద్దీన్, ఎఫ్ఆర్వో, కెరమెరి

'స్కౌట్స్ అండ్ గైడ్స్'తో విద్యార్థుల్లో క్రమశిక్షణ


బడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న నరేందర్

రెబ్బెన: స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలతో విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు దేశభక్తి అలవడుతుందని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం మచ్చగిరి నరేందర్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ పితామహుడు బడెన్ పావెల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని నిర్వహించారు. బడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఇన్‌చార్జి కరస్పాండెంట్ శ్రీనివాస్, హెచ్‌ఎం రవితేజ, సింగరేణి ట్రెనింగ్ కమిషనర్ కే.భాస్కర్, కరిష్మా, నరేశ్, సుమన్, కవిత, వరలక్ష్మి, వనజ, శైలజ, సంధ్యారాణి విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు


ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది

ఆసిఫాబాద్‌అర్బన్: సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని గుండి ఏరియా వాసవి భవన్ ఫంక్షన్ హాల్ ఎదుట శనివారం 100 కేవీఏ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ రాథోడ్ శేషారావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లో వోల్టేజీ సమస్య తీరుతుందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. డీఈఈ జీవరత్నం, ఏడీఈ ఫిరోజ్ ఖాన్, ఏఈ లక్ష్మిరాజం, లైన్‌మెన్‌లు శంకరయ్య, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్చి నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న పండితులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పెద్ద వాగు సమీపంలో గల శ్రీ బాలేశ్వరస్వామి ఆలయం దారిలో ముఖ ద్వారం (ఆర్చి) నిర్మాణానికి శనివారం పండితులు శ్రీధర్‌శర్మ, మధుకర్‌శర్మ, సత్యనారాయణ, నరేష్‌శర్మలు భూమిపూజ నిర్వహించారు. ముఖద్వారం నిర్మాణానికి అయ్యే ఖర్చులను భరిస్తున్న దాత సుబ్బా శంభుదాస్ –అరుంధతి దంపతులను కమిటీ సభ్యులు అభినందించారు. భక్తులు తాటిపల్లి రమేశ్, సుబ్బా శంభుదాస్, దండనాయకుల సురేశ్‌కుమార్, వల్లపు అశోక్, సాయిని రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, మహిళల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. శనివారం సిర్పూర్ (యూ) మండలం రాఘవాపూర్‌లోగల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లు, నిత్యావసరాలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి సమీపిస్తున్నందున ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించారు. మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను నిర్వాహకులకు సూచించారు.

దాడి కేసులో ముగ్గురి రిమాండ్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ద్వారకానగర్ ఏరియాకు చెందిన అక్రంఖాన్‌పై దాడి చేసిన కేసులో ముగ్గురు నిందితులను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. బియ్యం అక్రమ రవాణాపై పోలీసులకు సమాచారం అందిస్తున్నారనే నెపంతో ఈనెల 11న అక్రంఖాన్‌పై తైబానగర్ కాలనీకి చెందిన ఫారూక్, రాజిక్, సాదిక్‌లు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన అక్రంఖాన్ ఫిర్యాదుతో పోలీసులు ఈనెల 12న నిందితులను అరెస్టు చేసి సిర్పూర్ (టి) కోర్టులో హాజరపర్చగా రిమాండ్‌కు తరలించింది. తర్వాత బెయిల్ మంజూరైంది. జిల్లా కోర్టులో పట్టణ సీఐ.. రివిజన్ పిటిషన్ దాఖలు చేయగా, బెయిల్ రద్దు చేసి వారికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేసినట్లు సీఐ తెలిపారు.

'ఉన్నత లక్ష్యంతో చదవాలి'


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నార్నూర్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని ఎంపీడీవో జవహర్ లాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆదర్శ పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రశాంత్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వారి నైపుణ్యాన్ని బట్టి వివిధ రంగాల్లో రాణించాలన్నారు. ఇష్టంతో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఏరియాలో డైరెక్టర్ (పీఅండ్‌పీ) పర్యటన


మ్యాప్ పరిశీలిస్తున్న వెంకటేశ్వర్లు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి డైరెక్టర్ (పీఅండ్‌పీ) కే వెంకటేశ్వర్లు శనివారం పర్యటించారు. ముందుగా గోలేటిలోని జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులతో కాసేపు మాట్లాడారు. అనంతరం ఇన్‌చార్జి జీఎం నరేందర్‌తో కలిసి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని సందర్శించారు. ఓసీపీలో పనిచేస్తున్న అధికారులను పరిచయం చేసుకుని ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలు తెలుసుకున్నారు. ఓసీపీకి నిర్దేశించిన వార్షిక లక్ష్య సాధనకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం వెస్ట్ వ్యూ పాయింట్ నుంచి కైరిగూడ ఓసీపీ పని స్థలాలు, ఉత్పత్తి తీరును పరిశీలించారు. కైరిగూడ ఓసీపీ నుంచి డోర్లి–1 ఓసీపీకి వెళ్లే డైవర్షన్ రోడ్డు, వంతెనల నిర్మాణ పనులను పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని సివిల్ అధికారులను ఆదేశించారు. ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరన్న, సివిల్ ఎస్ఈ మదీనా భాషా, మేనేజర్ శంకర్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి


వాంకిడి: మాట్లాడుతున్న ప్రతినిధులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉమాభరద్వాజ్ సూచించారు. మండలంలోని బూర్గుడ సమీపంలోగల గిరిజన మహిళా డిగ్రీ కళాశాలను శనివారం న్యాక్ మెంబర్ కోఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ.. సభ్యుడు డాక్టర్ చంద్రకాంత్ డిగాన్కర్, గిరిజన శాఖ ఓఎస్డీ నీరజ్ సింహాతో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వారి విషయ సామర్థ్య స్థాయిని పరీక్షించారు. అనంతరం కళాశాలలోని వసతులు, నిర్వహణ తీరుకు సంతృప్తి వ్యక్తంజేశారు. రానున్న రోజుల్లో పీజీ కళాశాల ఏర్పాటు చేసుకునే దిశగా కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థులకు మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఆర్సీవో అగస్టీన్, ఐక్యూసీ కోఆర్డినేటర్ కల్పన, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో చదువుకోవాలి..

వాంకిడి: విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకుని చదువుపై దృష్టి సారిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సమతా భారత్ ఐక్య వేదిక ప్రతినిధులు జాడి అన్నారావు, జాడి ఆనంద్‌రావు, డోంగ్రి ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులతో సమావేశమై విద్యా ప్రాముఖ్యతపై వివరించారు. వారు మాట్లాడుతూ పరీక్షలపై భయం, ఒత్తిడి వీడి ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. చదువుకు పేదరికం అడ్డు కాదని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గడువులోపు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి): మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు మార్చి 15వ తేదీ లోపు నిర్మాణ పనులు చేపట్టాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శనివారం పైలట్ గ్రామపంచాయతీ మేడిపల్లిలోని మేడిపల్లి, రావన్‌పల్లి, లింబుగూడ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు మార్చి 15లోపు బేస్‌మెట్ లెవల్ వరకు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ వేణుగోపాల్ రెడ్డి, ఏఈ సజియొద్దిన్, పంచాయతీ కార్యదర్శి రాహుల్ పాల్గొన్నారు.

పూడిక తొలగించరూ..!



పెంచికల్‌పేట్: మండలంలోని బొక్కివాగు ప్రాజెక్టు కాలువల్లో చెత్తాచెదారంతో పాటు పూడిక చేరింది. దీంతో పంట పొలాలకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. యాసంగిలో పంట పొలాలకు నీరు అందే పరిస్థితి లేదని, అధికారులు వెంటనే స్పందించి పూడిక తీసి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గురుకుల పరీక్షకు సర్వం సిద్ధం

ఆసిఫాబాద్‌రూరల్: గురుకులాల్లో ఐదు నుంచి తొమ్మిదో తరగతి వరకు ప్రవేశానికి నిర్వహించనున్న పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గురుకుల డీసీవో శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. 3వేల మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష ఉంటుందని, గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతిస్తారని పేర్కొన్నారు.

సమస్యలపై విచారణ చేపట్టాలని వినతి

ఆసిఫాబాద్‌రూరల్: మైనార్టీ గురుకుల పాఠశాలల సమస్యలపై విచారణ చేపట్టాలని శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు టీకానంద్ మాట్లాడుతూ.. జిల్లాలో మైనార్టీ గురుకులాల్లో అవుట్ సోర్సింగ్ పోస్టుల నియామకాల్లో త్రీమెన్ కమిటీ లేకుండా భర్తీ చేసి అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. మైనార్టీ గురుకులాల్లో గతం నుంచి అనేక అక్రమాలు, అవినీతి జరుగుతోందని ఆరోపించారు. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. రెగ్యులర్ డీఎండబ్ల్యూవోను నియమించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: కౌటాలలోని 132 కేవీ టవర్ లైన్ పనుల్లో భాగంగా ఆదివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కౌటాల ఏడీఈ రాజేశ్వర్ శనివారం తెలిపారు. టవర్ లైన్ పనులతో నేడు కౌటాల మండలం యాపలగూడ, కోయగూడ, గురుడుపేట, కన్నెపల్లి, కనికి, బోదంపల్లి, చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్, బాబాపూర్, బాబాసాగర్, గంగాపూర్, చింతలమానెపల్లి, రుద్రాపూర్, బారెగూడ, పోతేపల్లి, కాటేపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. నేడు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నార్నూర్: దివ్యశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హీరానాయక్ మైదానంలో క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడా పోటీలు నిర్వహించేందుకు దివ్యశ్రీ ఫౌండేషన్ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

కాగజ్‌నగర్‌రూరల్: వేసవిలో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. నీటి సమస్య ఉన్న గ్రామాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉపాధి హామీ పనులను సోమవారం ప్రారంభించాలని ఆదేశించారు. డీఎల్‌పీవో ఓమర్, మిషన్ భగీరథ డీఈ పృథ్వీ, ఏఈ సాయికృష్ణ, ఏపీవో బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ల పరిశీలన

మండలంలోని మారుమూల గ్రామమైన ఊట్‌పల్లిలోని మిషన్ భగీరథ వాటర్‌గ్రిడ్‌లను ఎంపీడీవో రమేశ్, మిషన్ భగీరథ డీఈ పృథ్వీ పరిశీలించారు. ఏఈ సాయికృష్ణ, పంచాయతీ సెక్రటరీలు రమేశ్, బాపురావు పాల్గొన్నారు.

గోలేటి ఓసీపీని వెంటనే ప్రారంభించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో నూతనంగా ప్రారంభించనున్న గోలేటి ఓసీపీని వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు కృషి చేయాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి కోరారు. బెల్లంపల్లి ఏరియాలో డైరెక్టర్ పీఅండ్‌పీ కొప్పుల వెంకటేశ్వర్లు శనివారం పర్యటించగా ఏరియా ఏఐటీయూసీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. డైరెక్టర్‌ను శాలువాతో సన్మానించి ఏరియాలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏరియాకు పూర్వవైభవం తీసుకువచ్చేలా గోలేటి ఓసీపీని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించేందుకు కృషి చేయాలన్నారు. గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లలో మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాలని కోరారు. గోలేటిలో మ్యాన్‌పవర్ కొరత తీవ్రంగా ఉన్నందున ఎలక్ట్రీషియన్స్, ఫిట్టర్స్, ఈపీ ఎలక్ట్రీషియన్ సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. ఈపీ ఆపరేటర్లకు వేకెన్సీతో సంబంధం లేకుండా గ్రేడ్స్‌ను టైంబాండ్ ప్రకారం కల్పించాలని పేర్కొన్నారు. వీటితో పాటు ఏరియాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, జూపాక రాజేశ్, ఫిట్ కార్యదర్శులు మారం శ్రీనివాస్, గడ్డం రమేశ్, నాయకులు రారాజు, గణేశ్, రఘుపతి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి


మాట్లాడుతున్న అన్నాజి

లింగాపూర్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీపీఎం అన్నాజి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గ్రామ సంఘాల సభ్యులు, వీవోఏలతో శనివారం ఆరోగ్యమే మహాభాగ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం అన్నాజి మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతీ ఇంటి వద్ద మరుగుదొడ్డి నిర్మించుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పుట్టిన ప్రతీ శిశువుకు ముర్రుపాలు తాగించాలని, గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యకర్త భీమ్‌రావ్, ఏపీఎం తిరుపతి, సీసీ కైలాష్, ప్రదీప్, మహిళా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి'


ప్రచారం నిర్వహిస్తున్న ఆడే సురేశ్ నాయక్

లింగాపూర్: ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఆడే సురేశ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు రాథోడ్ మంగల్, రాజు, సచిన్, మహేందర్, అనిల్, విజయ్, పిరాజీ, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

'కూర రఘోత్తంరెడ్డిని గెలిపించుకుందాం'


మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేసే నాయకుడు కూర రఘోత్తం రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకుందామని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు ఆడే ప్రకాశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నాలుగు మండలాలకు సంబంధించిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. కెరమెరి మండల అధ్యక్షుడుగా రాథోడ్ రవీందర్, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్, జైనూర్ మండల అధ్యక్షుడిగా ఆత్రం దత్తు, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ రవీందర్, సిర్పూర్(యూ) అధ్యక్షుడిగా భూమన్న, ప్రధాన కార్యదర్శిగా మోహన్, లింగాపూర్ అధ్యక్షులుగా ఆడే సోహన్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ యువరాజ్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భరత్‌రావు, తుల్సిరాం తదితరులు ఉన్నారు.